# భారత ఆర్థిక వ్యవస్థ.. సంస్కరణల ప్రభావం

**ప్రపంచీకరణ, సరళీకృత విధానాల నేపథ్యంలో స్థూల ఆర్థిక సంస్కరణలు, శ్రామిక విధానాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. భారతదేశం అధిక వృద్ధిరేటు సాధించడానికి ప్రపంచీకరణ దోహదపడింది. ఈ నేపథ్యంలో... భారత్ అనేక రంగాల్లో సాధించిన విజయాలు అంతర్జాతీయ మీడియా వెలుగులోకి తెచ్చినప్పటికీ.. వాస్తవ పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది.**

ప్రైవేటు పెట్టుబడులను ఆశించినంత మేరకు ఆకర్షించకపోవడం, అంచనాల మేరకు వృద్ధి సాధించలేక పోవడం, ఉపాధి వృద్ధి తగ్గడం లాంటివి భారత్ ముందున్న సమస్యలు. సంస్కరణలు విజయం సాధించకపోవడానికి స్వదేశీ మార్కెట్లను సంస్కరించకపోవడం, అత్యంత క్లిష్టమైన శ్రామిక మార్కెట్ విధానాల రూపకల్పన కారణమని చెప్పవచ్చు. శ్రామిక మార్కెట్లో కఠిన(రిజిడిటీ) నియమాల వల్ల పెట్టుబడులు తగ్గడం, ఉద్యోగితా వృద్ధి ఊహించినంతగా జరగలేదు. శ్రామిక మార్కెట్లో నియంత్రణలు యాజమాన్యానికి అడ్డంకిగా మారాయి. ఈ చట్టాల వల్ల సంఘటిత రంగంలోని ఎక్కువ మంది శ్రామికులకు రక్షణ కరవైంది. దీంతో తక్కువ ఉద్యోగిత, తక్కువ పెట్టుబడులు అనే రెండు లక్షణాలున్న సంఘటిత రంగం ఏర్పడటానికి కారణమైంది.

అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ఐఎల్ఓ) ప్రాథమిక లక్ష్యం పురుషులు, స్త్రీలకు స్వేచ్ఛ, సమానత్వం, రక్షణతో కూడుకున్న నాణ్యమైన ఉత్పాదక ఉపాధి అందించడం. అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక సహకారానికి సంబంధించి ప్రభుత్వ విధానాలు, యాజమాన్య అవసరాల్లోనే కాకుండా అనేక విషయాల్లో మార్పులకు గురయ్యాయి. వివిధ వస్తు, సేవల వాణిజ్యానికి విదేశీ పోటీ.. ఆర్థిక వ్యవస్థ విస్తరణ, రక్షణకు ముఖ్య అవసరంగా రూపొందింది. ఉపాధి పరిమాణం, ఉపాధి నియమాలను శ్రామిక మార్కెట్ విధానాలు కాకుండా మిగతా కారకాలు నిర్ణయించే స్థితి ఏర్పడింది. ఆర్థిక వ్యవస్థ తన సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోకపోవడం లేదా అనేక నిర్మాణాత్మక కారణాల వల్ల శ్రామిక సమష్టి డిమాండ్ తగ్గింది. తక్కువ ఉపాధి కల్పన అల్ప సమష్టి డిమాండ్‌కు దారితీసి తద్వారా ఆర్థిక వ్యవస్థ తిరోగమన దిశగా పయనించడానికి కారణమవుతుంది.

## నిర్మాణాత్మక సర్దుబాట్లు, సరళీకరణ:

**ఆర్థిక సంస్కరణల్లో భాగంగా నిర్మాణాత్మక సర్దుబాటు విధానాలు కింది లక్ష్యాలను కలిగి ఉంటాయి...**

- సామర్థ్య కల్పన, ఉత్పత్తి, ధరలపై నియంత్రణలను పూర్తిగా తొలగించడం.
- అంతర్జాతీయ పోటీని అనుమతించడం, అంతర్జాతీయ సాపేక్ష ధరలు ఆర్థిక ఏజెంట్ల నిర్ణయాలను ప్రభావితం చేయడం.
- సాధ్యమైన మేరకు ఉత్పత్తి, వాణిజ్యంలో రాష్ట్ర ఏజెన్సీల పాత్ర తగ్గించడం.
- బ్యాంకింగ్ రంగంలో నియంత్రణలు తొలగించడం ద్వారా విత్త రంగాన్ని సరళీకరించడం.

భారతదేశం లాంటి ఆర్థిక వ్యవస్థల్లో స్థరిత ఆర్థిక విస్తరణకు ఉత్పాదక ఉపాధి ముఖ్య సాధనం లాంటిది. ఆదాయ సమాన పంపిణీ, పేదరిక నిర్మూలనకు ఉపాధి ప్రాధాన్యత ఎంతో ఉంది. కానీ భారత ఆర్థిక వ్యవస్థలో ఎంచుకున్న కొన్నిరంగాల్లోనే శ్రామిక ఉత్పాదకత, ఉపాధికి ప్రాధాన్యత నిచ్చినందువల్ల ఆర్థికాభివృద్ధి సాధ్యం కాలేదు. ఆర్థికవృద్ధి మందగించడానికి తీవ్ర ఎగుమతుల నిరాశావాదం, నియమిత ఆర్థిక వ్యవస్థలు ప్రధాన కారణమని ఆర్థిక నిపుణుల అభిప్రాయం. ఆర్థిక వ్యవస్థలో సరళీ కృత విధానాలు ఎక్కువగా లభ్యమవుతున్న శ్రామిక వనరుల వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది.

## మౌలిక సదుపాయల నిర్లక్ష్యం:

1980ల్లో గ్రామీణ ఉపాధి కల్పన దృష్టి వ్యవసాయ రంగం, ప్రాథమిక కార్యకలాపాల నుంచి ద్వితీయ, సేవారంగం వైపు మళ్లింది. తద్వారా దేశంలోని అనేక ప్రాంతాల్లో గ్రామీణ ఉపాధి పెరిగి గ్రామీణ పేదరికం తగ్గింది. 1990ల్లో ఈ విధానాలు సత్ఫలితాలనివ్వలేదు. 1991లో అవలంబించిన స్థూల ఆర్థిక వ్యూహాల వల్ల సంఘటిత రంగంలో ఉపాధి కల్పన స్తంభించడంతో పాటు ప్రభుత్వ రంగంలో ఉపాధి తగ్గింది. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ వ్యయం గ్రామీణాభి వృద్ధిపై తగ్గింది. మౌలిక సౌకర్యాలు, శక్తిరంగాలపై పెట్టుబడులు తగ్గాయి. ఈ కారకాలు గ్రామీణ ప్రాంత అభవృద్ధిపై రుణాత్మక ప్రభావాన్ని చూపాయి. ఉపాధిరంగాలకు ముఖ్యమైన విద్య, ఆరోగ్యం, పారిశుధ్య రంగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఈ రంగాలపై తగ్గిన ప్రభుత్వ వ్యయం రెండు విధాలైన ప్రభావాలకు కారణమైంది. ఒకవైపు ఉద్యోగిత తగ్గడంతో పాటు సాంఘిక అవసరాలను నెరవేర్చడంలో విఫలమయ్యాం. విత్తరంగంలో సరళీకరణ.. గ్రామీణ పరపతి లభ్యత తగ్గడానికి, గ్రామీణాభి వృద్ధి క్షీణతకు కారణమైంది. 1990ల్లో ఉపాధి కల్పన రేటు పట్టణ ప్రాంతాల్లో తగ్గింది. మహిళలు, పురుషుల్లో పనిలో పాలుపంచుకొనే రేటులో ఒడిదొడుకులు ఏర్పడ్డాయి. మహిళల పని కల్పన రేటు గణనీయంగా తగ్గింది. ప్రభుత్వరంగ ఉపాధి తగ్గినందువల్ల సంఘటిత రంగంలో ఉపాధి తగ్గినప్పటికీ పారి శ్రామిక ఉత్పత్తి, సేవారంగాల్లో విస్తరణ సాధ్యమైంది.

## వేతన-ఉపాధి Trade Off :

సమష్టి డిమాండ్ లోపించినందువల్ల నిరుద్యోగిత ఏర్పడుతుంది. ఇది ఉత్పత్తి, శ్రామిక వినియోగ స్థాయిని నిర్ణయిస్తుందని ప్రముఖ ఆర్థిక వేత్తలు కీన్స్, కాల్సెకి అభిప్రాయపడ్డారు. కీన్స్ ముందున్న ఆర్థికవేత్తల అభిప్రాయంలో శ్రామిక సంఘాలు రక్షితమైన, సమర్థమైన శ్రామిక చట్టాలు.. యాజమాన్య వర్గాలకు వేతనాల వ్యయాన్ని పెంచుతుందని అన్నారు. వీరి అభిప్రాయంలో వాస్తవిక వేతనాలు, నిరుద్యోగితకు విలోమ సంబంధం ఉంటుంది. వేతనాల తగ్గుదలను అనుమతించినట్లైతే ఉపాధి పెరిగి తద్వారా పనిచేయయడానికి ఇష్టపడే వారందరికీ ఉపాధి లభిస్తుంది. శ్రామిక మార్కెట్‌లో నియంత్రణలు తొలగించి స్వేచ్ఛగా పనిచేయడానికి అనుమతించినట్లైతే పూర్ణోద్యోగిత సాధ్యమవుతుందని కీన్స్ ముందున్న ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. వీరి సిద్ధాంతానికి ఇటీవల కాలంలో మద్దతు పెరిగింది.

వీరి వాదన 1990ల్లో భారతదేశ ఆర్థిక వ్యవస్థలో సరళీకృత విధానాల యుగంలో ఉపాధి కల్పన ప్రగతి అధ్యయ నానికి ఉపయోగపడింది. అయితే తయారీ రంగంలో ఉపాధి కల్పన రేటు తగ్గుదలను పరిశీలించినప్పుడు వాస్తవిక వేతనాలు, ఉపాధి మధ్య విలోమ సంబంధం ఉన్నట్లు ఎలాంటి ఆధారం లభించలేదు. దీనికి బదులుగా ఉత్పత్తి వృద్ధిరేటు, సాంకేతిక ప్రగతి ఉపాధిని ప్రభావితం చేసినట్లుగా కనిపిస్తోంది. సాంకేతిక మార్పులు శ్రామిక ఉత్పాదకత స్థిరంగా పెరగడానికి కారణమయ్యాయి. తద్వారా శ్రామిక వినియోగ స్వభావంలో మార్పులు చోటుచేసుకున్నాయి. తయారీ రంగానికి సంబంధించి అనేక ఉప రంగాల్లో వాస్తవిక వేతనాలకు, ఉద్యోగితకు ధనాత్మక సహసం బంధం ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి కారణం పరిశ్రమలో వృద్ధి జరుగుతున్నప్పుడు సాంకేతిక నవకల్పనలు చోటుచేసుకొని శ్రామిక ఉత్పాదన పెరిగి అధిక వేతనాలు సాధ్యమయ్యాయి. బడ్జెట్ అడ్డంకులు, వేతన బిల్లు తగ్గించుకోవాలనే ప్రభుత్వ దృక్పథం వల్ల ప్రభుత్వరంగంలో వేతనాలు, ఉద్యోగిత మధ్య ట్రేడ్ ఆఫ్ ఏర్పడింది. ఈ స్థితి సంఘటిత రంగంలో ఉపాధి తగ్గడానికి కారణమైంది.

### మహిళా ఉపాధి.. ప్రాధాన్యత:

1990ల్లోనూ, తర్వాత కాలంలోనూ తయారీ రంగంలో మహిళా ఉపాధి తగ్గింది. తయారీ రంగ ఉత్పత్తులకు అంతర్జా తీయ పోటీ పెరగడం, పారిశ్రామిక 'కాపిటలిస్ట్ ప్రొడక్షన్' ఒత్తిడి పెరగడం లాంటివి మహిళా ఉపాధి తగ్గడానికి కారణం. పీస్ రేటు (piece rate) ఆధారంగా గృహ ఆధారిత సబ్ కాంట్రాక్టింగ్ కార్యకలాపాల్లో మహిళా ఉపాధి పెరిగింది. తయారీ రంగం, కొన్ని పరిశ్రమలు.. ముఖ్యంగా 'నాన్ కన్జ్యూ మబుల్' వస్తువుల విషయంలో సబ్‌కాంట్రాక్టింగ్ పెరిగింది. కేరళలో జీడిమామిడి, కొబ్బరినార ప్రాసెసింగ్ పరిశ్రమ, తిరుపూర్‌లోని అల్లిక పరిశ్రమల్లో మహిళా ఉపాధి ఎగుమతి- ఆధారిత ఉత్పత్తిదారులకు ఎక్కువగా లభ్యమవుతోంది. ఉత్పత్తిలో ఎక్కువ అనిశ్చితత్వం, డిమాండ్‌లో ఒడిదొ డుకులు, రుతు సంబంధ నిరుద్యోగం ముఖ్య లక్షణాలుగా ఉన్న ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమల్లో మహిళా ఉపాధి ఎక్కువ. ఎగుమతి ఆధార పరిశ్రమల్లో మహిళల ఉద్యోగిత తిరోగమనంలో ఉండటంతో వేతనాలు కూడా తక్కువగానే ఉన్నాయి. ఐటీ, ఐటీ ఆధారిత రంగాలు 1990ల్లో భారత ఎగుమతుల్లో అతివేగంగా వృద్ధిచెందుతున్న రంగాలుగా నిలిచాయి. విద్యావంతులకు ఉపాధి అందించే సామర్థ్యంతో పాటు ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో విద్యావంతులైన మహిళలకు లాభోపేతమైన టర్మ్స్‌లో ఉపాధిని ఈ రంగం అందించింది. 1990ల్లో పట్టణ విద్యావంతుల్లో నిరుద్యోగితా రేటు తగ్గడానికి ఈ రంగం సాధిం చిన వృద్ధి ప్రధాన కారణం. మరోవైపు సాఫ్ట్‌వేర్, ఐటీ ఆధారిత రంగాలు అందించిన ఉపాధి ముఖ్యంగా ధనికులు, పట్టణ ప్రాంతాల్లోని ఇంగ్లిష్ చదువుకున్న వారిలోనే కేంద్రీకృతమైనట్లు విమర్శ ఉంది. అనుభవపూర్వక ఆధారాల ప్రకారం మహిళా శ్రామికులు ఎక్కువగా ఈ రంగాల్లోనే ఉపాధి పొందారు. కానీ ప్రస్తుత ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ఈ రంగంలో తిరోగమనం భవిష్యత్తులో మహిళా ఉపాధిని ప్రభావితం చేయగలదు.

**ఉపాధి – పరిశీలన :**

- మొత్తం మీద ఉద్యోగితా వృద్ధిలో తగ్గుదల కన్పిస్తుంది. 1980ల్లో ఉద్యోగితా వృద్ధిరేటు 1.55% కాగా 1990ల్లో 1.01% మాత్రమే
- ఆర్థిక వ్యవస్థలో శ్రామికులకు రక్షణ చాలా తక్కువ. మొత్తం ఉద్యోగితలో సంఘటిత రంగంలోని శ్రామికుల వాటా 7 నుంచి 8% కాగా వీరికే శ్రామిక రక్షణ చట్టాలు అందుబాటులో ఉన్నాయి. అసంఘటిత రంగంలో ఉన్న శ్రామికుల వాటా మొత్తం ఉద్యోగితలో 92 నుంచి 93% కాగా వీరికి ఏ విధమైన రక్షణ చట్టాలు లేవు
- సంఘటిత రంగంలోని ఉపాధిలో పెరుగుదల లేదు.
- మొత్తం శ్రామిక శక్తిలో క్యాజువల్ శ్రామికుల వాటాలో పెరుగుదల ఎక్కువ. 1977–78లో స్వయం ఉపాధి పొందినవారి శాతం 57 కాగా 1999–2000 నాటికి 53% తగ్గింది. కానీ క్యాజువల్ శ్రామికుల సంఖ్య 27 నుంచి 33% పెరిగింది.
- శ్రామిక శక్తి నాణ్యత మన దేశంలో పెద్ద సమస్యగా పరిణమించింది. స్కిల్ డెవలప్‌మెంట్, విద్య శ్రామికుల్లో తక్కువ. 1999–2000లో 44% శ్రామిక శక్తి నిరక్షరాస్యులు కాగా, 5% శ్రామికులు వృత్తి విద్యా నైపుణ్యం కలిగినవారు.

ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలన లాంటి సరళీకరణ, నియంత్రణలు లేని స్థూల ఆర్థిక వ్యూహాలు అవలంబించడం ద్వారా సాధించలేమని తెలుస్తుంది. ప్రభుత్వమే ప్రత్యక్షంగా స్థూల ఆర్థిక విధాన రూపకల్పన ద్వారా మౌలిక సౌకర్యాలపై పెట్టుబడులు పెంచుతూ సమష్టి మూలధన సంచయనం పెంచడానికి చర్యలు తీసుకోవాలి. కీన్స్ సూచించినట్లుగా మన దేశంలో డిమాండ్ రివైవల్ విధానాలను అమలుపరచాలి. ప్రస్తుత ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో నిరుద్యోగ సమస్య ఏర్పడకుండా వృద్ధితో కూడుకున్న ఉపాధి వ్యూహాలను ప్రభుత్వం అవలంబించాలి.